ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 5 జనవరి 2025
5



కాసో్క..

- జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఊపందుకున్న కోడిపందేలు
- మొబైల్ పద్ధతిలో భారీగా నిర్వహణ
- వాట్సాప్‌లో సమాచార మార్పిడి

6



నెరవేరిన స్వప్నం

- మునిసిపల్ కార్పొరేషన్‌గా కొత్తగూడెం
- ఫైల్‌పై సంతకం చేసిన ముఖ్యమంత్రి రేవంత్
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో కలిపి ఏర్పాటు

కొత్తగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం మునిసిపల్ కార్పొరేషన్‌గా అవతరించింది. ఈ మేరకు ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సంతకం చేశారు. ప్రస్తుత కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలతోపాటు సుజాతనగర్ మండలంలోని 7గ్రామాలను విలీనం చేయడం ద్వారా మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటుచేయడం జరిగిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం మునిసిపాలిటీలోని 36 వార్డుల్లో సుమారు లక్ష మంది, పాల్వంచ మునిసిపాలిటీలోని 24వార్డుల్లో సుమారు 120లక్షల జనాభా ఉన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలతోపాటు మండల కేంద్రమైన సుజాతనగర్, మంగపేట, నాయకులగూడెం, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, కొమటిపల్లి, నర్సింహసాగర్‌లు గతంలో జనరల్ కేటగిరీలో ఉన్నాయి. ఏజెన్సీ చట్టం వీటికి వర్తించకపోవడంతోపాటు 1/70యాక్ట్ పరిధిలో లేదు. దీంతో న్యాయపరంగా ఎటువంటి చిక్కులు లేకపోవడంతో మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాలు మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు కావడంతో అభివృద్ధి కొంత పుంతలు తొక్కనుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అదనపు నిధులు సమకూరుతాయి. ఈ రెండు పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. కొత్త పరిశ్రమలు ఏర్పడి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.



ముగ్గుల పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పాల్వంచ మునిసిపల్ కమిషనర్ సుజాత



ప్రథమ బహుమతి ముగ్గు..
విజేత: ఆర్.లక్ష్మీస్రవంతి, పాల్వంచ



ద్వితీయ బహుమతి ముగ్గు
విజేత: వి.దివ్య, పాల్వంచ



తృతీయ బహుమతి ముగ్గు..
విజేత: సీహెచ్.సుజాత కొత్తగూడెం

విజేతలు వీరే..

1. ఆర్.లక్ష్మిస్రవంతి, అంబేద్కర్ సెంటర్, పాల్వంచ(రూ.6వేలు)
2. వి.దివ్య, పాల్వంచ (రూ.4వేలు)
3. సీహెచ్.సుజాత, బాబుక్యాంపు, కొత్తగూడెం (రూ.3 వేలు)



అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థులు

నేలపై హరివిల్లు

ఘనంగా భద్రాద్రి జిల్లా స్థాయి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

- పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సౌరభం
- భోగి మంటలు, ఎడ్లబండ్లు, పొంగలి, హరిదాసుల సందడి
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళా లోకం...
- పోటాపోటీగా ముగ్గులు
- తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను చాటిన రంగవల్లులు
- మహిళల సృజనాత్మకతను ప్రశంసించిన అతిథులు

కొత్తగూడెం/కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నేల హరివిల్లులా హొయలు పోయింది. పూల సింగిడిలా మారి అలరించింది. చుక్కల చమక్కులతో ముగ్గులు అబ్బురపరిచాయి. సప్తవర్ణాల రంగులతో, అద్భుతమైన ఆకృతులతో మురిపించాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)... శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా నెలకొన్న సందడి సంక్రాంతి సంబురాలను ముందే ఆవిష్కరించింది. ముఖ్యఅతిథులుగా పాల్వంచ మునిసిపల్ కమిషనర్ కె.సుజాత, పెద్దమ్మతల్లి **(మిగతా 6వ పేజీలో)**



పాల్వంచలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు

నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు



- అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇళ్లను పూర్తి చేయిస్తాం
- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. ప్రతి హామీని నెరవేర్చాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం..
- మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

6

రంగవల్లులు తీర్చిదిద్దగా రారండి...

- నేడు ఖమ్మంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- వేదిక.. రిక్కాబజార్ ప్రభుత్వ హైస్కూల్
- విజేతలకు నగదు బహుమతులు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కళల గుమ్మం.. ఖమ్మంలో రంగవల్లులు సందడి చేయనున్నాయి. తెలుగు వారి సంస్కృతిని గుబాళించనున్నాయి. మహిళల సృజనాత్మకతకు, నైపుణ్యానికి వేదికగా నిలువనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఖమ్మంలోని పాత బస్టాండ్ ఎదురుగా గల రిక్కాబజార్ హైస్కూల్‌లో ఆదివారం జరగనున్నాయి. ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయి. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.6వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.4వేల నగదు, తృతీయ బహుమతిగా రూ.3వేల నగదు ఇవ్వనున్నారు. అదేవిధంగా ఐదుగురు విజేతలకు ప్రత్యేకంగా కన్సోలేషన్ బహుమతులను ఇస్తారు. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు రంగులు, వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయటానికి గరిష్ట సమయం 2గంటలు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో ఒకరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలను, సృజనాత్మకతను ప్రతిబింబించే ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని, ఉదయం 10 గంటలకు ముందే హాజరై తమ పేర్లు నమోదు చేసుకోవాలని 'ఆంధ్రజ్యోతి' ఖమ్మం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు కోరారు. మరిన్ని వివరాలకు 99661 15030, 96403 11380 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

7 నుంచి 'సదరం' క్యాంపులు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7 నుంచి మార్చి 25 వరకు నిర్ణయించిన తేదీల ప్రకారం సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయనున్నట్టు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. మీసేవా కేంద్రాల్లో సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌ఫొటోని మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాలి. స్లాట్ బుకింగ్ ప్రకారం దరఖాస్తుదారుడు మీసేవ రశీదుతోపాటు మెడికల్ క్యాంపునకు హాజరవ్వాల్సి ఉంటుంది. వైద్యులు క్యాంపుల్లో పార్ట్-ఏ వివరాలను ఆమోదించి సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేస్తారు. జనవరి 7, 21, 28, ఫిబ్రవరి 4, 11, 18, 25, మార్చి 4, 11, 18, 25 తేదీల్లో సదరం క్యాంపులను ఖమ్మంలోని ప్రధాన ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు.

వామనావతారంలో
రామయ్య దర్శనం



భద్రాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వామనావతారాన్ని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ, భాజభజంత్రీలు, మహిళ భక్తుల కోలాటాల నడుమ స్వామి వారిని మిథిలా స్టేడియ ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్య క్రమాలు నిర్వహించి స్వామి వారికి నివేదన చేశారు.



ప్రథమ బహుమతిని అందుకుంటున్న లక్ష్మీస్రవంతి



ద్వితీయ బహుమతిని అందుకుంటున్న దివ్య



తృతీయ బహుమతిని అందుకుంటున్న సుజాత



సంక్రాంతి పొంగలి వండుతున్న మహిళలు



ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థినులు



భోగిమంటల్లో చిందులేస్తున్న యువతి



హరిదాసుల వేషధారణల్లో కళాశాల విద్యార్థినులు

నేలపై హరివిల్లు

(5వ పేజీ తరువాయి)

దేవాలయ ఈవో రజనికుమారి, షీ టీమ్ జిల్లా అధికారి రమాదేవి, అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాల చైర్మన్ తలశిల భరత్‌కృష్ణ, డైరెక్టర్ తలశిల అవని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దుద్దుకూరి రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలకు జీవం పోయడంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని, మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముత్యాల ముగ్గుల పోటీలు ఎంతో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి మహిళలో ఒక ప్రతిభ, నైపుణ్యం దాగి ఉంటుందని, వాటిని వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. భారతీయ సంస్కృతిలో ముగ్గులు వేయడం ఒక కళ అన్నారు. ఇంటి ముందు ముగ్గులు అతిథులకు ఆహ్వానాన్ని తెలియచేస్తూ ఒక పాజిటివ్ దృక్పథాన్ని పెంచుతాయన్నారు. గత పదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, అనుబోస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాల యాజమాన్యం సహకారంతో ఈ పోటీలు జరిగాయి.

ముగ్గుల పోటీకి విశేష స్పందన

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. 180మంది మహిళలు పాల్గొని తమలో ఉన్న నైపుణ్యాన్ని చాటుకున్నారు. రంగు రంగుల రంగవల్లులతో కళాశాల ఆవరణ సప్తవర్ణశోభితంగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి.భోగిమంటలు, పొంగలి, పిండి వంటలు, ఎడ్లబండ్లను ప్రదర్శించారు. హరిదాసుల వేషధారణలో చిన్నారులు సందడిచేశారు. దీంతో పది రోజుల ముందుగానే పండుగ వాతావరణం వెల్లివెరిసింది. డూడూ బసవన్నలు, చెరుకుగడలు, గాలిపటాలు, గొబ్బెమ్మలు, పాడిపంటల ఆకృతులతో మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. మరి కొందరు వేసిన ముగ్గులు సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఉన్నాయి. ఈ సందర్భంగా అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాల విద్యార్థినులు, సిబ్బంది నృత్యాలతో సందడి చేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు నగదు బహుమతులను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి సీహెచ్.లక్ష్మణరావు, గిరీష్ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న వారికి గాయత్రి బ్యాంక్ అధికారి మల్లీశ్వరి చీరలను బహుకరించారు. న్యాయనిర్ణేతలుగా పద్మజ, రోజా లక్ష్మి, డాక్టర్ పిస్వాతి, పి.సుజాత వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పాత్రికేయులు జోగం తారకరామారావు, గుణ సురేష్, పూర్ణచందర్‌రావు, లెనిన్, పోటు పుల్లారావు, అబ్బురాం, ఏబీఎన్ కెమెరామెన్ చావా పాపారావు, యాడ్స్ ఇన్‌చార్జి రాజా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింహకుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ప్రథమ బహుమతి ఊహించలేదు...

ఆర్.లక్ష్మీస్రవంతి, పాల్వంచ

ముగ్గుల పోటీలను ప్రతి సంవత్సరం ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు. గత ఏడాది ముగ్గుల పోటీలో కన్సోలేషన్ బహుమతి గెలుపొందాను. ఈ ఏడాది ప్రథమ బహుమతి పొందడం ఎంతో సంతోషంగా ఉంది.

ఏడేళ్లుగా పాల్గొంటున్నా..

వి.దివ్య, పాల్వంచ

ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో అనుబోస ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో గత ఏడు సంవత్సరాలుగా పాల్గొంటున్నాను. ప్రతి సంవత్సరం ఏదో ఓ బహుమతి పొందుతున్నా. ఈ సారి ద్వితీయ బహుమతి పొందడం ఆనందంగా ఉంది. తెలుగు సంస్కృతి, సాంప్రదాయానికి పెద్దపీట వేస్తున్న ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు.

మహిళలకు ఎంతో ప్రోత్సాహకరం

సీహెచ్.సుజాత, కొత్తగూడెం

కొత్తగూడెం నుంచి ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు ఎంతో ఉత్సాహంగా వచ్చా. తృతీయ బహుమతి గెలుచుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి ఏబీఎన్, అనుబోస్ కళాశాల వారు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.



మాట్లాడుతున్న కేఏ పాల్

రూ.10వేల కోట్లతో జీపీలను అభివృద్ధి చేయాలి

▸ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

ఖమ్మం చర్చికాంపౌండ్, జనవరి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు మంజూరుచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గ్రామపంచాయతీ(జీపీ)లను అభివృద్ధి చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ కోరారు. శనివారం ఖమ్మం నగరంలోని కృష్ణా పంక్షన్‌హాల్‌లో శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మేధావులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.లక్షాపదివేల కోట్లుఅప్పు చేసిందని, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరుపున పోటీచేసి విజయం సాధించాలని, వారికి తాను ఎంతో సహకరించి విద్యా, వైద్యం, తదితరాలను ఉచితంగా అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను హామీల పేరుతో మభ్యపెట్టిందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తులం బంగారం ఇస్తామని మహిళలను మోసం చేసిందన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మభ్యపెట్టి ఓట్లు దండుకుని చివరకు మొండి చేయి చూపారన్నారు. భద్రాచలం నుంచి ఖమ్మం వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉందని, దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే సదరు రహదారిని అభివృద్ధి చేయాలన్నారు. 10లక్షల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారని, ఇంతవరకు నీరు అందించక వైఫల్యం చెందిన జిల్లాకు చెందిన మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం , భద్రాచలం, కొత్తగూడెం తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయలేదని, బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.

తెలంగాణా రైతుకు ఏపీలో సత్కారం

దమ్మపేట, జనవరి 4:(ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట అభ్యుదయ, ఆదర్శరైతు కొౌతా ఉమామహేశ్వరరావును ఏపీలోని గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వద్ద రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో సన్మానించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సత్కరించారు. ఉమా మహేశ్వరరావు చేస్తున్న సేంద్రియ వ్యవసాయంతో పాటు వాటిద్వారా స్వయంగా తయారు చేసిన ఆహార ఆహార ఉత్పత్తులను పరిశీలించి అభినందించారు.



ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పాఠశాలకు వెళ్లాలని మందలించినందుకు..

▸ పురుగులమందు తాగి గిరిజన విద్యార్థి ఆత్మహత్య

జూలూరుపాడు/చంద్రుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లమని కుటుంబసభ్యులు మందలించడంతో పురుగులమందు తాగిన గిరిజన విద్యార్థి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రుగొండ మండలం పోకలగూడెం పంచాయతీ పరిధిలోని బాల్యాతండా గ్రామానికి చెందిన లావుడ్యా శంకుచరణ్(17) జూలూరుపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ జూలూరుపాడులోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్నాడు. డిసెంబరు 27వ తేదీన ఇంటికి వెళ్లాడు. వారం దాటినా పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు జ్యోతి, వీరన్న తాత చంద్రులు కలసి శంకుచరణ్‌ను ఇంటి వద్ద ఇంకా ఎన్ని రోజులు ఉంటావని, పాఠశాలకు వెళ్లమని మందలించారు. దీంతో తనకు చదువుకోవటం ఇష్టం లేక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ నెల 3వ తేదీన ఇంట్లో ఉన్న పురుగులమందును సేవించి బ్యాగ్ తీసుకుని జూలూరుపాడులోని వసతి గృహానికి వెళ్లాడు. వసతి గృహంలోని గేటు ముందు కింద పడిపోయాడు. ఇది గమనించిన వాచ్మెన్ అతడిని జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలు మేరకు 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడ నుంచి ప్రైవేటు ఆసుపత్రులకు తర్వాత ఖమ్మం మమత ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శంకుచరణ్ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రుగొండ ఏఎస్సై పాపాయ్య తెలిపారు.



కాసో్క..

▸ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఊపందుకున్న కోడిపందేలు

▸ మొబైల్ పద్ధతిలో భారీగా నిర్వహణ

అశ్వారావుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వస్తుండటంతో కోడిపందేల హడావుడి పెరిగింది. ఏపీకి సరిహద్దున ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట రహస్యంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా ఏపీకి చెందిన కొందరు వ్యక్తులతో పాటు సత్తుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట పరిసరాల్లోని పందెపురాయుళ్లు సిండికేట్‌గా మారి మొబైల్ పద్ధతిలో కోడిపందేలు, పేకాటవంటి జూదం భారీగా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాట్లు చేసినందుకు ప్రతి పందేనికి కొంత సొమ్మును పందెపురాయుళ్లనుంచి నుంచి వసూలు చేస్తారు.

వాట్సప్‌లో కోడ్ భాష

ముందుగా ఫోన్ ద్వారా కోడి పందేల జట్లను నిర్ణయించుకొని ఆ రోజు ఏ ప్రదేశంలో పందెం జరుగుతుందో వాట్సప్‌లో కోడ్‌భాషలో సమాచారం పంపుతూ గంటల్లోనే పందెపురాయుళ్లంతా నిర్దేశించిన ప్రదేశాలకు చేరేలా ప్రణాళికలు రూపొందిస్తారు. పందెం వేసేవారు బైక్‌లు, ఆటోలు, కార్లలో పెద్ద సంఖ్యలో చేరుకుంటారు. పోలీసులు, ఇతర్రతా ఎవరైనా వస్తే సమాచారం ఇచ్చేందుకు కొంతమందిని నిఘా కోసం ప్రత్యేకంగా నియమించుకుంటారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే వీరు నిర్వాహకులకు సమాచారం ఇస్తారు. దాంతో తక్షణమే ఎక్కడివారు అక్కడ జారుకుంటారు. పందేలు, జూదం నిర్వహించిన ఆనవాళ్లు కూడా లేకుండా అక్కడ నుంచి వేరేచోటికి మకాం మారుస్తారు. ఇలా మొబైల్ పద్ధతిలో సాగే పందేలు మారుమూల అటవీ ప్రాంతాలు, సుదూరంగా ఉండే పొలాల్లో నిర్వహిస్తుంటారు. ఈ పందేల నిర్వాహకులు పోలీస్‌స్టేషన్ల వద్ద కూడా ప్రత్యేకంగా నిఘా పెట్టి పోలీసుల కదలికలను గమనిస్తూ ఉంటారు. మొబైల్ పద్ధతిలో నిర్వహించే ఈ పందేలు ఒక్కొక్కటి రూ.లక్షల్లోనే సాగుతాయి. రోజుకో చోట పందేలు నిర్వహిస్తూ పోలీసులకు చిక్కకుండా జూదం నిర్వహిస్తుంటారు.

మద్యం అమ్మకాలు, గ్యాంబ్లింగ్

కోడిపందేల బిరుల వద్ద మద్యం అమ్మకాలతో పాటు ఇతర రకాల గ్యాంబ్లింగ్ ఆటలు కూడా నిర్వహిస్తుంటారు. కొద్ది రోజులుగా అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రదేశంలో కోడిపందేలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా జనవరి 1న దాదాపు అన్ని గ్రామాల్లో కోడిపందేలు జోరుగానే సాగాయి. అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి ప్రాంతాల్లో ఇటీవలే పోలీసులు కోడిపందేలు, పేకాటలపై దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. జనవరి 1న అనేక గ్రామాల్లో పోలీసుల రాకను గమనించి పందెపురాయుళ్లు పరారైన సంఘటనలు ఉన్నాయి. ఈ పందేలు సంక్రాంతి వరకు రోజురోజుకి పెరిగి పోయే అవకాశాలున్నాయి. తెలంగాణలో మూడు దశాబ్దాలుగా కోడిపందేలపై నిషేధం ఉంది. దాంతో సంక్రాంతి సమయంలో ఇక్కడివారంతా ఏపీకి వెళ్లిపోతుంటారు. అయితే వచ్చే సంక్రాంతి మూడురోజులైనా ఏదో ఒక విధంగా కోడిపందేలు ఈ ప్రాంతంలోనే నిర్వహించాలనే పట్టుదలతో పందెపురాయుళ్లు ఉన్నట్లు సమాచారం.

కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు

కరుణాకర్, అశ్వారావుపేట సీఐ

కోడిపందేలపై నిషేధం ఉంది. ఎవరైనా అక్రమంగా కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పందేలు వేసేవారు ఎంతటివారైనా చర్యలు తప్పవు. సంక్రాంతి నేపథ్యంలో ఇప్పటికే పలు బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. కోడిపందేలు, పేకాట, గ్యాంబ్లింగ్ నిర్వహణపై ప్రజలకు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.

నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు

కూసుమంచి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి తొలివిడతగా 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ చేయనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మంత్రి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించారు. పలు రోడ్ల నిర్మాణపనులకు శంఖుస్థాపన చేసి, కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ మార్పు కావాలని పేదలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నుకున్న ప్రజాప్రభుత్వం సంక్షేమంతో పాటు అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ఇచ్చిన ప్రతీహామీ, ప్రతీ మాట నెరవేర్చాలనే దృఢసంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రతిపేద కుటుంబానికి సొంత ఇంటికల నెరవేర్చనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 80లక్షల మంది ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 64లక్షల మందిని యాప్ ద్వారా సర్వే చేసినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులు నాలుగైదురోజుల్లో పూర్తవుతాయని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో వివిధ దశల్లో ఉన్న డబుల్ ఇళ్లను కూడా నిధులు మంజూరీ చేయించి పూర్తిచేస్తామన్నారు. అదేవిధంగా పూర్తయిఉన్న ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

సీసీరోడ్లకు శంకుస్థాపన

మండలంలోని లోక్యాతండాలో, రూ.15లక్షలు, కోక్యాతండాలో రూ.20లక్షలు, లింగారాంతండాలో రూ.20లక్షలు విలువైన సీసీ రోడ్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నేలకొండపల్లి మండలంలో 42మంది లబ్ధిదారులకు రూ.16లక్షలు విలువైన, కూసుమంచి మండలంలో 64మందికి రూ.19లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఇరిగేషన్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ఈఈ వెంకటరెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ స్వర్ణకుమారి, డీయల్‌పీవో రాంబాబు, ఏడీఏ సరిత, కూసుమంచి ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణపై 'పోలవరం' ప్రభావం ఎంత?

ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం

భద్రాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావం ఎంతో అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదిక నెల రోజుల్లో సిద్ధం చేయాలన్నారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. దీంతో మరోసారి పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం ముప్పుపై సర్వత్రా చర్చ నెలకొంది. గత కొన్ని దశాబ్దాలుగా పోలవరంప్రాజెక్టు నిర్మాణంతో దిగువన ఉన్న భద్రాచలం ఏజెన్సీలోని భద్రాచలం బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం తదితర మండలాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని సాగునీటి, ఇంజనీరింగ్ రంగ నిపుణులైన ప్రొఫెసర్ శివాజీరావు, విద్యాసాగర్‌రావు, వెంకటరెడ్డిలు హెచ్చరించారు. అంతేకాదు భద్రాద్రి ఏజెన్సీ వాసులు సైతం రెండు దశాబ్దాలుగా గొంతెత్తి నినదిస్తూనే ఉన్నారు. వామపక్ష, ఆదివాసీ సంఘాల ఉద్యమాలు, పోరాటాలు ఉవ్వెత్తున సాగాయి. అయినా ఎవరూ ఈ ప్రాంత వాసులమొరను ఆలకించలేదు.

భద్రాద్రి రామాలయానికి ముప్పు

ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందం సర్వే సమయంలో భద్రాచలం రామాలయంకు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ఎంత మేరకు ముప్పు పొంచి ఉంటుదో తేల్చనుంది. ఈ మేరకు అధికారిక గణాంకాలను తయారు చేసే పనిలో ప్రభుత్వం సిద్ధమవుతోంది. అలాగే రామాలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ముప్పు సమస్య లేకుండా ఉంటుందా లేదా అంచనా వేయనున్నారు. గతంలో సాగునీటి ఇంజనీరింగ్ నిపుణులు సంవత్సరంలోని 365 రోజుల్లో భద్రాచలం వద్ద గోదావరి తొలి ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 43 అడుగులు కనీస నీటిమట్టాన్ని కలిగి ఉంటుందని హెచ్చరించిన సందర్భాలున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మరోసారిక్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితిని అధ్యయనం చేసేందుకు నిర్ణయించింది.

2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద

2022 జూలైలో వచ్చిన గోదావరి మహావరదలతో భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, అశ్వాపురం, చర్ల తదితర మండలాలు అతలాకుతలమైన పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా 32 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి గరిష్ఠంగా 71.3 అడుగుల నీటిమట్టం నమోదుకావడంతో ఏజెన్సీలో రాకపోకలు స్తంభించడమే కాదు, ప్రజలు సైతం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సురక్షిత కేంద్రాల్లో తలదాచుకున్న పరిస్థితి ఉంది. ఈ పరిస్థితికి పోలవరం బ్యాక్ వాటర్ కారణమనే వ్యాఖ్యలు వినిపించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఐఐటీ హైదరాబాద్ ఇంజనీరింగు నిపుణులతో అధ్యయనం చేస్తుండటం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

వరుస చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

ఖమ్మంక్రైం, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఖమ్మంతో పాటు ఇతరజిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని శనివారం టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఖమ్మం టుటౌన్ ఇన్‌స్పెక్టర్ బి.బాలకృష్ణ, సీసీఎస్‌పోలీసు సిబ్బందితో కలిసి ఖమ్మం రాపర్తినగర్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నల్లగుండి తండా గ్రామానికిచెందిన గుగులోత్ నవీన్ అనే యువకుడు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడని తెలిపారు. అతడి బ్యాగు చెక్ చేయగా ఆ బ్యాగులో బంగారం, వెండి ఆభరణాలు కనిపించడంతదో అతడిని అదుపులోకి తీసుకని విచారించినట్టు తెలిపారు. తాను 2024 డిసెంబరునెలలో ఖమ్మం బైపాస్‌రోడ్డులోని ఎస్ఆర్‌సీ టవర్స్ అపార్టుమెంట్ 4వ ఫ్లోర్‌లో రాత్రి సమయంలో ఒకప్లాట్ తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండివస్తువులను దొంగిలించానని తెలిపాడు. 2024 ఆగస్టునెలలో కుషాయిగూడ మేడ్చల్ దగ్గర ఒక స్కూటీని, డిసెంబరు నెలలో మేడ్చల్‌లో రెండు ఇళ్లలో దొంగతనాలు చేశానని, అదేడిసెంబరు నెలలో హనుమకొండలో ఒక ఇంటిలో దొంగతనం చేశానని ఒప్పుకున్నట్టు ఏసీపీ తెలిపారు. అతను 2016 నుంచి వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, హైదరాబాదు జిల్లాల్లో అనేక దొంగతనాలు చేసినట్టుకూడా విచారణలో చెప్పినట్టు ఏసీపీ తెలిపారు. అతడి వద్ద నుంచి నాలుగు బంగారు గాజులు, రెండు బంగారు చైన్లు, రెండు నల్లపూసల గొలుసులు, రెండు బంగారు నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్ ఒకటి, ఐదు బంగారు ఉంగరాలు, జతచెవి బుట్టలు, 9 లక్ష్మికాసుల బిళ్లలతో పాటు కేజీన్నర వెండి వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.18లక్షలు ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్, టుటౌన్ సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

వాలీబాల్‌లో బీటీపీఎస్ ఉద్యోగుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్,జనవరి4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో విద్యుత్‌సౌదాలో ఇంటర్‌ప్రాజెక్టు వాలీబాల్ టోర్నమెంట్‌లో మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ క్రీడాఉద్యోగులు ద్వితీయ స్థానం సాధించారు. శనివారం ప్లాంట్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో క్రీడాకారులను సీఈ బిచ్చన్న అభినందించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదే ప్రోత్సాహంతో అంతర్జాతీయ క్రీడల్లో రాణించి జెన్కోకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు.క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీఈలు ఆనంద ప్రసాద్, ఎస్ వినత్యనారాయణ, క్రీడా కార్యదర్శి కల్తి నర్సింహారావు, మేనేజర్ ఉదయ్‌కిరణ్, తిరుపతయ్య, మధు రంగారావు, ప్రశాంత్ ప్రవీన్, నరసింహా, సతీష్, సంపత్, ప్రసాద్‌కుమార్, గోపి అశోక్, సత్యనారాయణ, అనిల్ వెంకట్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పీవో, ఎమ్మెల్యేకు ఎంపీడీవోల శుభాకాంక్షలు

మణుగూరుటౌన్,జనవరి4(ఆంధ్రజ్యోతి):ఐటీడీఏపీవో రాహుల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను ఎంపీడీవోల సంఘం నాయకులు కలుసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎంపీడీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎంపీవో పి వెంకటేశ్వర్లు తదితరులు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవోను మార్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు శ్రీనివాసరావు, జమలారెడ్డి, ఇతర ఎంపీడీవోలు పీవోను సన్మానించారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే కూడా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డబ్ల్యూసీఆర్ జిల్లా చైర్మన్‌గా లింగయ్య

కరకగూడెం,జనవరి4(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డబ్ల్యూసీఆర్ చైర్మన్‌గా కరకగూడెం మండలం భట్టుపల్లి పంచాయితీ భట్టుపల్లి గ్రామానికి చెందిన సారిక లింగయ్య శనివారం నియామకం అయ్యారు. హైదరాబాద్‌లోని డబ్ల్యూసీఆర్ జాతీయ కార్యాలయంలో డబ్ల్యూసీఆర్ వ్యవస్థాపక ఫౌండేషన్ జాతీయ చైర్మన్ నలమాస శ్రీకాంత్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం తీసుకున్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సింగరేణి పాఠశాల ప్రతిభ

ఇల్లెందుటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఎగ్జిబిషన్‌లో ఇల్లెందు సింగరేణి పాఠశాల విద్యార్థి టి.వరణ్‌కోమల్ ఉత్తమ ప్రతిభకనబర్చారు. స్మార్ట్ అగ్రికల్చర్ రోబోతో విత్తనాలు నాటడం, నేల చదును చేసి అవసరమైన ఫెర్టిలైజర్ పిచికారి, తేమశాతాన్ని గుర్తించి నీటి సాగుబడి తెలుసుకోవడం ఈయంత్రం ప్రత్యేకత.. హర్యానా రాష్ట్రంలోని పానిపట్‌లో డిసెంబరు 26 నుంచి 31వరకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. బాలశాస్త్రవేత్తగా సైన్స్‌ఎగ్జిబిషన్ ట్రోఫీతోపాటు సర్టిఫికెట్‌ను అందించారు. శనివారం బహుమతి పొందిన విద్యార్థితోపాటు సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులను ఏరియా జీఎం కృష్ణయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జీవీ. మోహన్‌రావు, హెచ్ఎం శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు విష్ణుప్రియ బొడ్డుల శ్రీనివాసరావు, ధనలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటినుంచి పంటల నమోదు

- ఈనెల 8 వరకు కార్యక్రమం
- ప్రతీ మండలంలో ఒక గ్రామం ఎంపిక
- ప్రత్యేక యాప్‌లో నమోదు



ఖమ్మంవ్యవసాయం, జనవరి4(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో ఎన్నిఎకరాల్లో పంటలు వేశారు.. ఎన్ని ఎకరాలు ఖాళీగా ఉన్నాయి వంటి వివరాల కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి పంటల నమోదు చేపట్టనున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన క్రాప్ బుకింగ్‌పై రాష్ట్ర ఉన్నతాధికారులు వ్యవసాయాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనేపథ్యంలో ఈనెల8వరకు ఈ కార్యక్రమం నిర్వహించడానికి వ్యవసాయశాఖ యంత్రాంగం సన్నద్ధమవుతోంది. తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 21 మండలాలలోప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని తీసుకుంటారు. ఒకటో సర్వే నెంబర్ నుంచి చివరి సర్వే నెంబర్ వరకు రైతు పేరు, సర్వే నెంబర్, సాగు విస్తీర్ణం, ఖాళీ ఎకరాలు నమోదు చేస్తూ ప్రభుత్వం సూచించిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

3లక్షల ఎకరాల్లో పంటలు

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో మూడు లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 2,14892 ఎకరాల్లో వరి, 91,227 ఎకరాల్లో మొక్కజొన్న, 744 ఎకరాల్లో వేరుసెనగ, 8776 ఎకరాల్లో పెసర, 807 ఎకరాల్లలో మినుములు సాగు చేస్తారని అంచనా వేసింది. రైతుభరోసా నేపథ్యంలో సర్వే చేస్తున్నట్లు తెలుస్తున్నది. అధికారంలోకి రాగానే రైతుబంధు స్థానంలో రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.7,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో ప్రకటించింది. గతబీఆర్ఎస్ ప్రభుత్వం గుంట జాగా నుంచి ఎంత భూమి ఉన్నా రైతు బంధు ఇచ్చింది. కాగా ప్రస్తుత ప్రభుత్వం సాగు భూములకు, అసలైన రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్లతో మంత్రి పొన్నం వీడియో కాన్ఫరెన్స్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డుప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డుభద్రతా మాసోత్సవాలను నిర్వహించాలని రవాణాబీసీసంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ పాల్గొన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను ప్రచారం చేయాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వీడియో సమావేశంలో అదనపు డీసీపీ నరేష్‌కుమార్, జిల్లారవాణాధికారి వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ. ఎంటీ. హేమలత, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, ఆర్డీఓ జి.నరసింహారావు, ఆర్అండ్‌బీ ఈ.ఈ తానేశ్వర్, నేషనల్ హైవే అధికారి కె. దివ్య పాల్గొన్నారు.

ఉత్తమ రైతు రాంరెడ్డికి సన్మానం



ఖమ్మంరూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో విజ్ఞాన్ యూనివర్సిటీ మరియు రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అభ్యుదయ రైతులకు శనివారం పురస్కారాలు అందజేశారు. ఖమ్మంరూరల్ మండలం, ముత్తగూడెం గ్రామానికి చెందిన ఉత్తమ రైతు అనుముల రాంరెడ్డిని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సన్మానించి అవార్డు అందించారు.

మద్యం తాగి పాఠశాల విధులకు

- ఉపాధ్యాయుడిపై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆగ్రహం
- దమ్మపేట మండలం కటుకూరు ప్రాథమిక పాఠశాలలో ఘటన



టీచర్ యాంగ్లీని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట,జనవరి4:(ఆంధ్రజ్యోతి):మద్యం తాగి విధులకు హాజరైన ఉపాధ్యాయుడిపై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన దమ్మపేట మండలం కటుకూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగింది. ఎమ్మెల్యే జారే శనివారం పూసుకుంట గ్రామ సందర్శనతో పాటు కటుకూరు గ్రామాన్ని సందర్శించారు. అకస్మికంగా గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మూడోతరగతి చదువుతున్న విద్యార్థికి కనీసం గ్రామం పేరును బోర్డు మీద రాయలేకపోవటంతో ఎమ్మెల్యే టీచర్ యాంగ్లీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస బోధన చేయకుండా ఎందుకు జీతాలు తీసుకుంటున్నారంటూ నిలదీశారు. మారుమూల ప్రాంతంలో ఉంది ఎవరూ పట్టించుకోరని ఇక్కడికి వచ్చావా అంటూ ప్రశ్నించారు. నిత్యం పాల్వంచ నుంచి కటూరు పాఠశాలకు రాకపోకలు సాగించటంపై ప్రశ్నించారు. ఇదే సందర్భంలో టీచర్ మద్యం సేవించినట్లు గుర్తించారు.తీవ్రంగా మందలించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీవో డేవిడ్ రాజుకు చెప్పారు. అనంతరం పాఠశాల రికార్డులను ఎమ్మెల్యే ఆదినారాయణ పరిశీలించారు.

తుదిదశకు రివర్ ఫెస్టివల్ పనులు

భద్రాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున రివర్ ఫెస్టివల్ నిర్వహణ కోసం జరుగుతున్న ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో శనివారం గోదావరి కరకట్ట ప్రాంతంలో రివర్ ఫెస్టివల్ కోసం నిర్మాణం చేపడుతున్న తాత్కాలిక పర్యాటకుల విడిది గృహాలు, వివిధ గిరిజన వంటకాలు, గిరిజన కళాఖండాలకు సంబంధించిన స్టాల్స్ పర్యాటకులు విహరించే బోట్ షికారుకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యాటకులకు అన్ని వసతి సౌకర్యాలతో తాత్కాలిక విడిది గృహాల నిర్మాణం పనులు 90 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ గోదావరి పక్కన ఏర్పాటు చేసిన స్టేజి నుంచి భద్రాచలం పట్టణం మొత్తం వినిపించేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని దేవస్థానం ఈఈ రవీందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఈఈ రవీందర్ పంచాయతీ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

భద్రాద్రి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

చుంచుపల్లి,జనవరి4(ఆంధ్రజ్యోతి):భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోతాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం నుంచి8వతేదీ వరకు మాత్రమే సమర్పించాలని స్పష్టం చేశారు. మెరిట్ జాబితాను డీఎంహెచ్‌వో నోటీస్‌బోర్డులో,అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు ఇతర రాష్ట్రాల కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తున్న చేసుకున్నారని, ఈనేపథ్యంలో మూడురోజుల సమయం ఇచ్చినట్లు తెలిపారు.

7వదశ సీఈని కలిసిన ఇంజనీర్లు

పాల్వంచ,జనవరి4 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటీపీఎస్ 7వ దశ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు శనివారం కేటీపీఎస్ 7వ దశ సీఈ వెంకటేశ్వరరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.ముందుగా జెన్కో వ్యాప్తంగా ఇంజనీర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల నూతనంగా నియమించిన అసిస్టెంట్ ఇంజనీర్లకు పోస్టింగ్‌లు ఇవ్వడానికి ముందే చాలా సంవత్సరాలుగా జనరేటింగ్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లను వారు కోరుకున్న స్థానాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి యాస్మిన్, ట్రెజరర్ సంపత్, సభ్యులు బ్రహ్మాజీ, శ్రీకాంత్, రాజేష్, వెంకట్రావు, అరుణ్‌కుమార్, లక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

వామనావతారంలో శ్రీరాముడు

దుమ్ముగూడెం,జనవరి4(ఆంధ్రజ్యోతి):ముక్కోటిఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో రామయ్య శనివారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలసుందరం వారిచే శ్రీరామచరిత్ర హరికథా కాలక్షేపం నిర్వహించారు. ప్రముఖ గాయని వాగ్దేవి ఆలపించిన రామసంకీర్తనలు, భద్రాచలంకు చెందిన భవ్య బృందం కూచిపూడి నాట్యప్రదర్శన భక్తులను అలరించాయి. కోలాట భజనలు, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి తిరువీధి సేవను జరిపించారు.





సమష్టి కృషితోనే శాంతి భద్రతల పరిరక్షణ

ఎస్పీ రోహిత్ రాజ్

మణుగూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): పోలీసుల సమష్టి కృషితోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందని రోహిత్ రాజ్ అన్నారు. శనివారం మణుగూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో 92 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ వంగా రవీంద్రరెడ్డి, సీఐ సోమా నతీసకుమార్, ఎస్ఐలు మేడా ప్రసాద్, బత్తిని రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల మెగా వైద్య శిబిరం సక్సెస్

పినపాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలైన పిట్టతోగు, మల్లారం, తిర్లాపురం గ్రామాల ఆదివాసీల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన హెల్త్ క్యాంపునకు ప్రత్యేక వైద్య నిపుణులు హాజరై ఈ వైద్య శిబిరంలో ఉచితంగా సేవలందించారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డిలు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఆదివాసీలతో మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో పాఠశాల భవనం లేనప్పటికీ, చింతచెట్టునే పాఠశాల ఆవరణగా మార్చి విద్యార్థులకు చదువును బోధిస్తున్నానని, అయినా తమ గ్రామస్థులు సహకరించడం లేదని ఆదివాసీ యువకుడు ఇడమయ్య ఎస్పీకి తెలిపాడు. ఇందుకు స్పందించిన ఎస్పీ.. ప్రతి ఆదివాసీ ఇడమయ్యలా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. గ్రామంలో సారా అరికట్టాలని ఆదివాసీ మహిళలు ఎస్పీకి మొర పెట్టుకున్నారు.

ఆదివాసీ యువకులకు వాలీబాల్ కిట్లు, సోలార్ లైట్లు, దుప్పట్లు, వైద్య శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులు, శిబిరానికి హాజరైన వారికి భోజన వసతి, రవాణా ఏర్పాట్లు చేసిన ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజ్‌కుమార్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మణుగూరు 100 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్, ప్రముఖ వైద్యులు శశిధర్, వైద్యాధికారి దుర్గాభవాని, ఆర్ఎంపీ వైద్యులు ఎం. రవిశేఖర్ వర్మ, వై. శ్రీరామ్, చల్లగుండ్ల నర్సింహారావు, సోందుపాష, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో బాలుడి అరెస్ట్

అశ్వారావుపేట రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిగా ఉన్న బాలుడిని శనివారం పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓగ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాలుడు ఈనెల 1వ తేదీన లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం బాలుడిని శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ యాయాతిరాజు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూర్పులోకవరం గ్రామంలో శనివారం సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. రూ. 20,600 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీన పరుచుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నివేదిత తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల కోర్టు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు టీజీఎన్పీడీసీఎల్ చైర్‌పర్సన్ ఎస్వీ వేణుగోపాల్ సోమవారం ఖమ్మానికి రానున్నారు. ఖమ్మం మమతా రోడ్డులోని ఖమ్మం విద్యుత్ 2 సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ మేరకు విద్యుత్ కోర్టు నిర్వహించేందుకు ఎస్ఈ సురేందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరణ ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ప్రకటించారు. ఫిర్యాదుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వావలంబన దిశగా..

- 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు సంఘంలో సభ్యత్వం
- ఇప్పటికే జిల్లాలో 5,666 సంఘాలు
- 1,687 సంఘాల ఏర్పాటుకు కార్యాచరణ

పురపాలకం	ప్రస్తుత ఎస్‌హెచ్‌జీల సంఖ్య	నూతన లక్ష్యం
ఖమ్మం	4,015	1289
మధిర	562	77
సత్తుపల్లి	513	121
వైరా	576	199

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా సామాజికంగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక మహిళా రుణాలు, చిరు, భారీ వ్యాపారులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నాయి. మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణ పెంచేందుకు వారిని ప్రోత్సహించేందుకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళ సంఘంలోని సభ్యులకు వ్యక్తిగతంగా వ్యాపారాలు చేసేందుకు వెసులుబాటు కల్పించి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించారు. ఆదే విధంగా మహిళా స్వయం సహాయక సంఘాల సంఖ్యను పెంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలు మైక్రో ఫైనాన్స్ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా కోరిన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘం సభ్యులుగా అవకాశం కల్పిస్తోంది. ఏడాది కాలంలోనే రెండు సార్లు కొత్త సంఘాలను ఏర్పాటు చేయగా మరోసారి మెప్మాకు సంఘాల ఏర్పాటు లక్ష్యాన్ని కేటాయించారు.

జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థ, మధిర, సత్తుపల్లి, వైరా పురపాలకాల్లో ఉన్న 18ఏళ్ల నుంచి 60 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఆధారంగా సంఘాల లక్ష్యాన్ని కేటాయించారు. ఆయా పురపాలకాల్లో రేషన్‌కార్డులు కలిగిన మహిళలపై సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మెప్మా పరిధిలో 5,666 మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా 55,572 మంది సభ్యులు సంఘాలుగా ఏర్పడి మెప్మా ద్వారా రుణాలను పొందుతున్నారు. నూతనంగా మరో 1,687 సంఘాలను మార్చి నాటికే పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఇందిరమ్మ సర్వేలో మెప్మాలోని కమ్యూనిటీ ఆర్గనైజర్లు నుంచి రిసోర్స్ పర్సన్ల వరకు కీలకంగా వ్యవహరిస్తుండడంతో ఖమ్మం జిల్లాలో నూతన సంఘాల లక్ష్యంపై కొంత ప్రభావం పడుతోంది.

కొత్త సంఘాల ఏర్పాటుపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

నూతనంగా మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్, జిల్లా సంస్థాగత నిపుణురాలు(డీఎంసీ) సుజాత శనివారం ఖమ్మం నగర పాలక సంస్థలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కొత్త సంఘాలు ఏర్పాటుపై సమీక్షించారు. అర్హత కలిగిన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘం సభ్యులుగా చేర్పించాలని సూచించారు. టీఎంసీ సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, సీవోలు ఉపేందర్, సల్మా, రోజా, ద్రౌపతి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కమ్మనైనది మాతృభాష: డీఈవో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): కమ్మనైనది మాతృభాష అని డీఈవో వెంకటేశ్వరచారి అన్నారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్న కథ కవితా కార్యశాల రెండో రోజు ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చక్కని శైలిలో కథలు, కవిత్వం రాయడం నేర్చుకోవాలన్నారు. అనంతరం జాతీయ బాలో కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన బాలోత్సవ్ మాదిరిగానే ఈ కార్యశాలను నిర్వహిస్తున్నామని, అందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ కథా రచయిత శీరంశెట్టి కాంతారావు కథ నిర్మాణం, ప్రయోజనం గురించి వివరించారు. కవి విమర్శకుడు మండల సుబ్బారావు కవిత్వం ప్రయోజనం వివరిస్తూ కవులేం చేస్తారంటే ... జనానికి నోరు ఇస్తారు. సామాజిక చైతన్యం కలిగిస్తారంటూ శివారెడ్డి కవిత వినిపించారు. కవిలి సెల్ భూతం కథ నోర్మూయ్ అనే రెండు శీర్షికలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు చిట్టి మధుసూదన్, సూర్యనారాయణ, కొత్తగూడెం క్లబ్ మేనేజర్ మన్సూర్, సిబ్బంది శ్రీనివాస్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో పి.సాయి సింధు(చుంచుపల్లి), ఎస్.అవినాష్(భారత్ విద్యాలయం-తల్లాడ), జి.లక్ష్మీశరణ్య(పాల్వంచ), ఎస్‌కె.నదియా(పాల్వంచ), బి.విరాట్ తేజ్(లక్ష్మీదేవిపల్లి), డి.మనో సమన్విత(భద్రాచలం), బి.వశిష్ట(పాల్వంచ), ఎస్.శృతి కీర్తన(ఎర్రగుంట), జి.జాహ్నవి(కొత్తగూడెం) ఉన్నారు.



మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా డీఈవో వెంకటేశ్వర చారి

కాడలు ఎక్కువగా లేకుండా పామాయిల్ గెలలు కోయాలి

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవరెడ్డి

దమ్మపేట, జనవరి 4:(ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలలకు కాడలు ఎక్కువగా లేకుండా వాటిని కోయాలని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. శనివారం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్యాలపాడు గ్రామానికి పామాయిల్ కౌలు రైతు కామేశ్వరరావు తన ట్రాక్టర్‌లో పామాయిల్ గెలలను ఫ్యాక్టరీకి తీసుకువాచ్చాడు. అదే సమయంలో గెలల ట్రాక్టర్‌తో వచ్చిన కామేశ్వరరావును గెలలను చైర్మన్ పరిశీలించారు. పామాయిల్ గెలల కాడ పొడవు ఉండటం వల్ల ఆయిల్ రికవరీలో నష్టం జరుగుతుందని, కాడలు ఎక్కువగా లేకుండా రైతులు దగ్గర ఉండి గెలలను కోయించాలని చైర్మన్ రైతులను కోరారు. తోటలలో గెలలు అయిపోయాయని కూలీలు గెడలతో కోయడం వల్ల కాడ పొడవు ఎక్కువగా వచ్చినట్లు కామేశ్వరరావు తెలిపాడు. ఈసందర్భంగా పామాయిల్ దిగుబడులపై చైర్మన్ ఆరా తీశారు. ఆయన వెంట జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్ ప్రాజెక్టు శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ కళ్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకు దెరువుకు వెళ్లి కానరాని లోకాలకు..

- సిద్దిపేట జిల్లాలో కరకగూడెం మండల వాసి అనుమానాస్పద మృతి



మహేష్(ఫైల్)

కరకగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం వెళ్లి అక్కడ అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరకగూడెం మండలం అనంతారం పంచాయతీ అల్లెరుగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన మహేష్ (28) అనే వ్యక్తి ఎలక్ట్రీషన్ పనులు చేస్తుంటాడు. గత మూడేళ్ల నుంచి బతుకు దెరువు కోసం సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి పంచాయతీలో ఓ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం వెళ్లాడు. అక్కడ ఓ ఇంట్లో మహేష్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉంటున్నారు. గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన మహేష్ ఇంటికి రాకపోవడంతో స్నేహితులు శుక్రవారం ఉదయం పరిసరాలను పరిశీలించారు. కాగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద అతడి చెప్పులు కనిపించడంతో ఆ బావిలో చూడగా మహేష్ అనుమానాస్పద మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు అక్కడే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అల్లెరుగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య కౌసల్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మహేష్ మృతితో అల్లెరుగూడెంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

- మత్కేపల్లి నామవరం గ్రామంలో ఘటన

చింతకాని, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పగడాల మహేష్ (23) కొంత కాలంగా ఏమి పనిచేయకుండా ఖాళీగా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మహేష్‌ను తండ్రి అంజయ్య మందలించడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మందుబాబులకు మూడురోజుల జైలు

ఖమ్మంక్రైం, జనవరి4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పట్టుబడిన ఒకరికి ఖమ్మం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి బి.నాగలక్ష్మి మూడురోజుల జైలుశిక్ష విధించారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గొల్లగూడేనికి చెందిన ఓలారీ డ్రైవర్‌కు మూడురోజుల శిక్ష విధించడంతో పాటు మరోనలుగురికి రూ.2500 నుంచి ఆరువేల వరకు జరిమాన విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.

ట్రెయినీ కలెక్టర్ సహకారంతో ల్యాప్‌ట్యాప్‌లు

ఖమ్మంఖానాపురంహవేలి జనవరి4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నయబజార్‌కు ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సహకారంతో 6 ల్యాబ్‌ట్యాబ్‌లు, వాటికి సంబంధించిన పరికరాలు సమకూరాయని కళాశాల ప్రిన్సిపాల్ కేఏస్ రామారావు తెలిపారు. శనివారం ట్రెయినీ కలెక్టర్ కళాశాలను సందర్శించి ల్యాబ్‌ట్యాబ్‌లను కళాశాల ప్రిన్సిపాలీకు అందించారు. గత నెలలో కళాశాలను తనిఖీ చేశారు. అక్కడ పాడైపోయిన కంప్యూటర్లు ఉండగా విద్యార్థులు కొత్త కంప్యూటర్లు అవసరముందని కోరగా వెంటనే కలెక్టరుకు విషయం వివరించి వెంటనే కంప్యూటర్లు వచ్చేలా కృషిచేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ మరో నెల రోజుల్లో కళాశాలకు వస్తానని అప్పటివరకు పైథాన్ కోర్సు నేర్చుకోని వాటికి సంబంధించిన వివరాలను తెలపాలని విద్యార్థులకు సూచించారు.

రగ్గుల పంపిణీ

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు నయబజార్, రాజేంద్రనగర్ పాఠశాలల విద్యార్థులకు శనివారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రగ్గులు, స్నాక్స్, బొమ్మలను వితరణగా అందించారు. మొత్తం ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు ఆకాష్, ప్రధానోపాధ్యాయులు గాయత్రి,సుధారాణి, ఉపాధ్యాయులు విజయ్, జీవన్, జాన్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

తిరుమలాయపాలెం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో పార్టీలకతీతంగా అందరు భాగస్వాములు కావాలని ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. శనివారం మండలంలోని బచ్చోడులో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన సందర్శించారు.యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యపానం, గుట్కా, సిగరేట్ తాగవద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీజడ్పటీసీ బెల్లం శ్రీను, అరవిందరెడ్డి, హనుమంతరావు, పాల్గొన్నారు.

పాలేరులో శరవేగంగా ఇళ్ల సర్వే

- ఇప్పటికే నియోజకవర్గంలో 91శాతం పూర్తి
- సంక్రాంతి తరువాత ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా జాబితా



ఇందిరమ్మ సర్వేప్రక్రియ పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి

కూసుమంచి, జనవరి5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లసర్వే శరవేగంగా సాగుతోంది. యాప్ ద్వారా సర్వే ప్రక్రియలో జిల్లాలో పాలేరు నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉంది. ఇళ్ల మంజూరీ కోరుతూ పాలేరు నియోజకవర్గంలో ప్రజాపాలన కార్యక్రమంలో 70,918 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 65,120 దరఖాస్తులపై అధికారయంత్రాంగం సర్వే నిర్వహించారు. అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో కూసుమంచి మండలంలో 94.32శాతం, తక్కువగా నేలకొండపల్లి మండలంలో 86.83శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఖమ్మంరూరల్ మండలంలో మొత్తం 22,469 దరఖాస్తులు రాగా, 20,866 ఇళ్లలో సర్వే పూర్తయింది. కూసుమంచి మండలంలో 16,325దరఖాస్తులురాగా 15398ఇళ్లలో సర్వే పూర్తయింది. నేలకొండపల్లి మండలంలో 15,173 దరఖాస్తులు రాగా 13,175ఇళ్లలోనూ, తిరుమలాయపాలెం మండలంలో 16,951దరఖాస్తులు రాగా 15,207ఇళ్లలో సర్వే పూర్తయింది. మరో నాలుగైదు రోజుల్లో సర్వే పూర్తి అవుతుంది.

సంక్రాంతి తర్వాత జాబితా

సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేయనున్నారు. అనంతరం గ్రామాల వారీగా లబ్ధిదారుల ఎంపిక జాబితాను కలెక్టర్‌కు పంపించనున్నారు. దీంతో ఇళ్లకోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల కల నెరవేరనుంది. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రజాపాలన ఆన్‌లైన్ నమోదులో కొందరు దరఖాస్తుదారుల పేర్లు గల్లంతయ్యాయి. వారు ఇప్పటికే ఎంపీడీవో కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలోనే సమస్యను పరిష్కరించి, సర్వేచేసి తమకు కూడా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

నాలుగైదు రోజుల్లో సర్వేపూర్తి

ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి

మరో నాలుగైదు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుంది. సిబ్బందితో వేగవంతంగా సర్వే నిర్వహిస్తున్నాం. కూసుమంచి మండలంలో 94.32శాతం పూర్తయింది. కొన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్య కారణంగా కొంత ఆలస్యంగా జరుగుతుంది.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసేలా చూస్తాం
- కమిషనర్ అభిషేక్ అగస్త్య



నిరుద్యోగులతో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి4(ఆంధ్రజ్యోతి): రేపటి భారతదేశానికి ఉన్నతమైన సేవలు అందించే అవకాశం నేటి యువతిపైనే ఉందని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత స్థితికి ఎదగాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిరుద్యోగులకు సూచించారు. శనివారం పాత కేఎంసీ కార్యాలయంలోని గ్రంథాలయాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న నిరుద్యోగ యువతకు ప్రేరణ కల్పించేలా మాట్లాడారు. గ్రంథాలయంలో ఉన్న నిరుద్యోగులు ఎటువంటి ఉద్యోగ పరీక్షలకు హాజరైతున్నారో తెలుసుకున్నారు. దేశంలో ఉద్యోగాలకు పోటీతో పాటు అవకాశాలు కూడా పెరుగుతున్నాయన్నారు. కష్టపడి చదివితే మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతాయని ప్రోత్సహించారు. నిరుద్యోగుల కోరిక మేరకు గ్రంథాలయాన్ని ఉదయం నుంచి రాత్రి వరకు తెరిచి ఉంచేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేస్తామని, రోజు వారు పత్రికలు చదివే వారి నుంచి ఇబ్బంది లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, తాగునీరు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి



టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో


- ఎంపీడీవో యర్రయ్య

నేలకొండపల్లి,జనవరి4(ఆంధ్రజ్యోతి):స్త్రీలు ఆర్థిక అభివృద్ధి సాధించటం ద్వారా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యర్రయ్య కోరారు. మండల పరిధిలోని ఆచార్లగూడెంగ్రామానికి చెందిన నందిని గ్రామసమాఖ్య స్వర్ణలత స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా టీసెంటర్‌ను ఎంపీడీఓ ప్రారంభించారు.కార్యక్రమంలో ఏపీఎం ఆశోకరాణి, ఎంఈఓ చలపతిరావు, మండలసమాఖ్యఅధ్యక్షురాలు శ్రీలత, ఎమ్మార్వై ఆలస్యం మధుసూధన్‌రావు, టీ సెంటర్ నిర్వాహకురాలు జిల్లవల్లి సుభద్ర, సీసీపాల్గొన్నారు.



యువత ఆనందోత్సాహం

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా యూత్ ఫెస్టివల్



ఖమ్మంస్పోర్ట్స్,జనవరి4(ఆంధ్రజ్యోతి): నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా యూత్ ఫెస్టివల్ శనివారం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా జరిగింది. యూత్ ఫెస్టివల్‌ను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ వల్ల విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన పెంపొందుతుందని తద్వారా సాంఘీక దురాచారాలను రూపుమాపవచ్చని అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్, ఎస్సే రైటింగ్, వక్తృత్వ పోటీ, డ్యాన్స్, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, స్పోర్ట్స్ కన్వీనర్ వెంకన్న, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ నారాయణ, కళాశాల చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సెక్రెటరీ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ కె వి. రమణారావు, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, భద్రాద్రి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

- కాకతీయ యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్ ప్రతాపరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రతాపరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి4(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని కాకతీయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో కేఎండీసీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ యూనివర్శిటీ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలను ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఖమ్మం, ఆదిలాబాద్ లీగ్ మ్యాచ్‌ను క్రీడాకారులను పరిచయం చేసుకొనిఆయన ప్రారంభించారు.మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ నిర్ణీత 27ఓవర్లలో 99పరుగులు చేసి ఆలౌట్ కాగా, ఖమ్మం జట్టు 14ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసి విజయం సాధించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిరంజన్‌రెడ్డి,సెక్రెటరీ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ రమణారావు, పోటీల కో-ఆర్డినేటర్ పీడీ వెంకన్న, యూనివర్శిటీ పీజీకళాశాలప్రిన్సిపాల్ రవికుమార్,టోర్నీఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉపేందర్ ఉన్నారు.

జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ సంఘం ఎన్నిక

ఖమ్మంమార్కెట్,జనవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ సంఘం అధ్యక్షుడిగా నగర టాక్స్ ప్రాక్టీషనర్ ఉల్లిబోయిన సైదులు ఎన్నికైనారు. శుక్రవారం రాత్రి నగరంలో ఓహోటల్‌లో జరిగిన జీఎస్టీ జిల్లా సంఘం జనరల్‌బాడీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రెండు సంవత్సరాల కాలపరిమితితో కూడిన జిల్లా సంఘం కమిటీకి సెక్రెటరీగా కొమ్మరాజు పవన్‌కుమార్, కోశాధికారిగా గుద్దేటి రమేష్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఊటుకూరు శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా చిలుకూరి శ్రీధర్‌రెడ్డి, ఈసీలుగా వాసు, రామక్రిష్ణ, ఉపేందర్, సాయిసుధామోహన్, ఈశ్వరయ్య, ఖాజా, సురేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.సమావేశంలో రాష్ట్రవాణిజ్య పన్నుల జాయింట్ కమీషనర్ రావుల శశిధరాచారి, ఆల్ ఇండియా టాక్స్ ప్రొఫెషనల్స్ సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడు నగేష్ రంగి, జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ సంఘ సభ్యులు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సూర్యనారాయణ



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓబీసీసెల్ జిల్లాఉపాధ్యక్షుడిగా గజ్జి సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో గజ్జి సూర్యనారాయణకు నియామకపత్రం అందించారు.

ముగిసిన జిల్లా టాలెంట్ టెస్ట్



ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభ పాటవ పరీక్ష శనివారం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శాంతినగర్‌లో నిర్వహించారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ప్రశ్నపత్రాల సీల్డ్ కవర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఆవిష్కరించారు. ఏఎమ్ఓ రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ కృష్ణకుమారి పరీక్షను ప్రారంభించారు. విజేతలకు ప్రతీవిభాగంలోనూ ప్రథమ బహుమతిగా రూ.2000, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.1000తో పాటు మెమెంటో సర్టిఫికెట్లను అందించారు. విద్యార్థులకు నగదు బహుమతులను జడ్పీహెచ్ఎస్ ఎన్టీఆర్ నగర్, సత్తుపల్లి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని కోట ఇందిర ఆర్థిక సహాయంతో అందించారు. కార్యక్రమ నిర్వహణలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లగాని కృపాబాలానందం, వడ్డే చంద్రశేఖర్, టీఎస్‌ఎస్టీఎఫ్ జిల్లా సలహాదారు, ప్రధానోపాధ్యాయులు టి.సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు పి.భీమరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు

తెలుగు మీడియంలో ప్రథమస్థానం: పి లక్ష్మీ ప్రసన్న (జెడ్‌పీహెచ్ ఎస్.రేజర్ల, సత్తుపల్లి మండలం),ద్వితీయ బహుమతి బి.ప్రశాంతి (జడ్పీహెచ్ఎస్ ముదిగొండ), కె.వంశీ(జడ్పీహెచ్ఎస్‌మోటమర్రి,బోనకల్ మండలం)

ఇంగ్లిష్‌మీడియం: ప్రథమ బహుమతి: పి.వెన్నెల (జడ్పీహెచ్ఎస్‌జలగంనగర్ ఖమ్మం రూరల్), ద్వితీయబహుమతి: సీహెచ్ సాయి గౌతమ్ (జీహెచ్ఎస్‌టీవీఎం మధిర), తృతీయబహుమతి:ఎస్.కెఆసిఫ్ (జడ్పీహెచ్ఎస్‌పినపాక, తల్లాడ మండలం).

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల..

ప్రథమబహుమతి: ఎల్.భవాని (ఎంజెపీటీ ఎర్రుపాలెం,మధిర)ద్వితీయ బహుమతి: ఎన్. కార్తీక్ (టీజీఎంఎస్ కారేపల్లి) తృతీయ బహుమతి-ఆర్.శ్రీమౌనిక (టీజీఎంఎస్, టేకులపల్లి).

ప్రైవేటు పాఠశాలలు

ప్రథమ బహుమతి: శ్రీజ(టాలెంట్ స్కూల్, సత్తుపల్లి) ద్వితీయ బహుమతి: ఎన్.లక్ష్మీ శ్రీజ (బాలభారతివిద్యాలయం, తల్లాడ) తృతీయ బహుమతి: ఎస్.రాజశేఖర్‌రెడ్డి (భరత్ విద్యానికేతన్, మధిర) విద్యార్థులు గెలుచుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఖమ్మంటౌన్,జనవరి4(ఆంధ్రజ్యోతి): బోడెపుడి విజ్ఞాన కేంద్రం సీపీఎం ఖమ్మంటుటౌన్ కమిటీ ఆధ్వర్యంలో మంచికంటి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. బీపీ, షుగర్, పిట్స్‌తదితర అనారోగ్య సమస్యలకు వైద్యులు పరీక్షలునిర్వహించి నెలకు సరిపడా మందులను అందించారు. ఈమెడికల్ క్యాంపులో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ 8ఏళ్లుగా క్రమం తప్పకుండా నెలలో మొదటి శనివారం ఉచిత క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈకార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రావెళ్ల రంజిత్, రేష్మాదుర్గా, పిల్లలమర్రి సుబ్బారావు, అనిల్‌కుమార్, రాజేష్, సీపీఎం ఖమ్మండివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు పాల్గొన్నారు.

అర్చకులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి



మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న అర్చకులు

ఖమ్మంటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ధూప దీప నివేదన అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం అండా ఉంటుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం అర్చక సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ధూప, దీపనైవేద్య అర్చక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి అన్నావజ్జుల ప్రసాదశర్మ మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం అర్చకుల సమస్యలను ఆయనకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్చకులకు సముచిత గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వీరస్వామి, వివిధ మండలాలనుంచి వచ్చిన అర్చకులకు కేలండర్‌ను అందించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మునగలేటి రమేశశర్మ, ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవాచార్యులు, వివిద మండలాల అర్చకసంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కన్నేటి దంపతులు

ఖమ్మంరూరల్: మంత్రిపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఖమ్మంరూరల్ మండలం, మంగళగూడెం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నేటి నరసింహరావు, మార్కెట్ కమిటి డైరెక్టర్ కన్నేటి జ్యోతి దంపతులు శనివారం మంత్రి నివాసంలో కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు వేయింగ్ మిషన్ అందజేత



ఖమ్మంవ్యవసాయం,జనవరి4(ఆంధ్రజ్యోతి): నగర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్ అనిత దంపతుల కుమార్తె బాణాల గాయత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని 46వ డివిజన్‌లోని అంగన్వాడీ కేంద్రానికి వేయింగ్ మిషన్ అందజేశారు. ఏటా పిల్లల పుట్టిన రోజులకి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సంవత్సరం వేయింగ్ మిషన్‌ను అంగన్వాడి కేంద్రానికిఇచ్చారు.

నాయీ బ్రాహ్మణుల బైక్ ర్యాలీ

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికల సందర్భంగా శనివారం నగరంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా యల్లమండల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాస్ పోటీచేస్తున్న సందర్భంగా నామినేషన్లు వేశారు. తొలుత ఖానాపురంలోని శ్రీఅభయవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్రమహాసభలు నేటినుంచి 8 వరకు కాకినాడలో జరుగుతున్నాయని రాష్ట్రఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ.రవి, ఎ.వెంకట్ అన్నారు. శనివారం నగరంలోని మంచికంటి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండోమహాసభ ఖమ్మంలో, తొమ్మిదవ మహాసభ హైదరాబాద్‌లో, పదకొండవ మహాసభ నల్గొండలో జరిగాయన్నారు. ఈ మూడు మహాసభల పతాకాలను జాతాలో కాకినాడ తీసుకెళ్తున్నామని తెలిపారు. హైదరాబాద్, నల్గొండ జాతాలకు వరంగల్ క్రాస్ రోడ్ వద్ద జిల్లా యుటియఫ్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ర్యాలీగా ఖమ్మం నగరంలోనికి జాతా ప్రవేశించి ఖమ్మం జిల్లా జాతాను కలుపుకొని వైరా, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి మీదుగా పతాక జాతా నిర్వహించారు.

క్రీడా కిట్లు పంపిణీ

ఖమ్మంఖానాపురంహవేలి జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రావత్తినగర్ తెలంగాణ మైనారిటీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం వాలీబాల్ కిట్, డంబెల్ కిట్‌లను శనివారం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ చుండు అఖిల ప్రిన్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాచారం దేవాలయాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి



పూజలు నిర్వహిస్తున్న జడ్జి దంపతులు

ఏన్కూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): నాచారం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం హైకోర్టు జడ్జి పీకేస్వామి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు జడ్జి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, సత్యనారాయణ చార్యులు, తిరుమల సత్యనారాయణచార్యుల సిబ్బంది పాల్గొన్నారు.

'మానసిక ఒత్తిడిని అధిగమించాలి'

ముదిగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి జీవించాలని ప్రముఖ సైకియాట్రిస్టు డాక్టర్ సతీష్‌బాబు సూచించారు. శనివారం ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మనస్సును జయించండి... మానసిక ఒత్తిడిని జయించాలని నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎగుడు దిగుడుగా రహదారి

- రహదారి మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రహదారిని సమాంతరంగా నిర్మించాలని వినతి



కల్లూరులో ఎగుడు దిగుడుగా ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ రహదారి

కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఏఐ రహదారి ఎగుడుదిగుడుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిచి వాహనం నడిపితే ఇక ప్రమాదాల బారిన పడినట్లే. ఇప్పటికే కల్లూరు పట్టణంలో వాహనాల రద్దీతో ఈ రహదారిపై పలు ప్రమాదాలు జరిగాయి. ఇటీవల కాలంలో ద్విచక్ర వానంపై జారీ పడి రామవాచార్యులు అనే విశ్రాంత ఉద్యోగి మృతి చెందగా, మరో ఘటనలో ఇద్దరు యువకులు వాహనంపై జారి తీవ్రంగా గాయపడ్డారు. ఇంత జరుగుతున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాదిన్నర క్రితం ఎన్‌హెచ్‌ఏఐ తరుపున తల్లాడ నుంచి పెనుబల్లి వరకు ఈ రహదారిపై బీటీ రహదారిని నిర్మించారు. అయితే యంత్రాలతో రహదారిపై సమాంతరగా బీటీ పనులు చేయకపోవడంతో ఎగుడు దిగుడుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇలా ఎన్‌హెచ్‌ఏఐ రహదారిపై పాయపూరు నుంచి కల్లూరులో టీటీడీ కల్యాణ మండపం, స్థానిక ప్రధాన సెంటర్ నుంచి ఖాన్‌ఖాన్‌పేట వరకు రహదారి ప్రమాదకరంగా మారింది. ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం ఈ రహదారి ఇరువైపుల 0 పాయింట్ (మధ్యలో) నుంచి ఇరువైపుల 100 మీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ రహదారికి మధ్యలో ఎగుడు దిగుడుగా ఉండటంతో రహదారి విస్తీర్ణం పరిమితంగా మారింది. దీంతో వాహనాలు కుదుపునకు గురై ఆకస్మాత్తుగా జారీపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని సమాంతరంగా తయారు చేసి వాహనదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరుతున్నారు.

ఈ విషయమై ఎన్‌హెచ్‌ఏఐ అధికారి బషీర్‌ను వివరణ కోరగా.. హైవే రహదారిపై బీటీ ఎగుడు దిగుడు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి ఆధునికీకరణ చేసేలా త్వరలో పనులు చేపడతామని తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

● కందుల రఘువీర్, కల్లూరు



కల్లూరులో రహదారి ఎగుడు దిగుడుగా మారడంతో ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారీన పడ్డారు. అయిన అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిత్యం పెద్దవాహనాల రాకపోకలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం నుంచి బయటపడ్డా. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని సమాంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులు మంచి మార్గాలను అలవర్చుకోవాలి

» న్యాయాధికారి మారగాని శ్రీనివాస్



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన మార్గాలను అనుసరించి ముందుకు సాగాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవాఅధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యాభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌ల ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను బడికి పంపించకుండా పనికి ఉపయోగించి స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటే రేపటి భావి తరానికి అన్యాయం చేసినట్లవుతుందని, విద్యార్థులే దేశ పురోగాభివృద్ధికి మూలిక్యాలని పేర్కొన్నారు. సమాజంలో ఆడపిల్లలు ఆర్థికంగా ఎదగాలని, వరకట్నం ఇవ్వడం తీసుకోవడం నేరమని, వరకట్న నిర్మూలనకు భావితరాలు కృషి చేయాలని సూచించారు. పిల్లలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మీ క్రమశిక్షణే మిమ్మల్ని జీవితం ఉన్నతమైన శిఖరాలకు చేరవేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జీవీ.లింగారెడ్డి, మందపాటి సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదులు అరుణకుమారి, రజని, ప్రసాద్, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనను ఎత్తివేయాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, జనవరి4(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మునిసిపాలిటీలోని లాలాపురంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి చెందిన వ్యవసాయశాఖ దగ్గర ఉన్న రైతులు, పంటల భూముల డేటా ఆధారంగా భరోసా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నా యకులు సంక్రాంతి మధుసూదన్‌రావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, సంక్రాంతి నర్సయ్య, పురుషోత్తం, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం

» యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, వెంకట్



మాట్లాడుతున్న చావా రవి

తల్లాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, వెంకట్ అన్నారు. శనివారం స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న స్వర్ణోత్సవాల జాతకు స్థానిక నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.లాల్‌సాహెబ్, తాళ్లూరి శ్రీనివాసరావు, సుదా రామారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం పనులను శనివారం హౌసింగ్‌శాఖ పీడీ శ్రీనివాసరావు, మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్‌లు సందర్శించి పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన విషయం విదితమే. పనులు జరుగుతున్న తీరుపై పీడీ శ్రీనివాసరావు సంతృప్తి వ్యక్తం చేశారు.

వైరా పోస్టాఫీసులో ఆధార్ సేవలు

వైరా, జనవరి4(ఆంధ్రజ్యోతి): వైరా పోస్టాఫీసులో ఆధార్ సేవలను అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ పోస్టాఫీసులోని ఆధార్ సేవ కేంద్రంలో అన్నిరకాల సేవలను అందిస్తామని మధిర ఐపీవో వైకోటేశ్వర్, ఎస్‌పీఎం బి.రాంబాబు తెలిపారు. వైరా ప్రాంత ప్రజలు పోస్టాఫీసులోని ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

తల్లాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సేవ కార్యక్రమాల్లో తల్లాడ లయన్స్‌క్లబ్ ముందంజలో ఉందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబూరావు కొనియాడారు. శుక్రవారం రాత్రి తల్లాడ ఆర్బీ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏడుగురు మహిళలకు కుట్టుమిషన్లు, లక్ష్మీనగర్ ముత్యాలమ్మ గుడికి మైక్‌సెట్, దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు. డీసీ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కాపా మురళీకృష్ణ యాచవరపు రాఘవరెడ్డి, సీహెచ్.శివప్రసాద్, గోలి అమరేందర్‌రెడ్డి, తీగెల మోహన్‌రావు, కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, అంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా ప్రదర్శనలు



ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

కారేపల్లి, జనవరి4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారంలో గల జవహర్ డీఏవీ పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యావైభవం కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్టాల్స్‌ను మాదారం స్టీల్ ప్లాట్ డీజీఎం బీయూవీఎస్ రాజు, దీప తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మాధవి, పి.నర్సింహారావు, ఉదయ్‌కుమార్, వీరబాబు, దామోదర్ రావు, శ్రీనివాస్, యశోద, గణేష్, పాల్గొన్నారు.

'విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషిచేయాలి'

ఏన్కూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంపొందించేదుకు కృషి చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం కూరాకుల సైదయ్య కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కాంప్లెక్స్ పరిధిలో నూతన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కనీస ప్రమాణాల స్థాయి చదవడం, రాయడం వచ్చే విధంగా కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్య, నాగమణి, నాగగిరీష, సింధు, దేవి, ప్రసాద్, శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఏన్కూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): క్రీడా మైదానాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖమ్మం పట్టణ వైద్యుడు శెట్టిపల్లి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని నారాయణ బసవమ్మ చారిటబుల్‌ట్రస్టు ద్వారా శనివారం మరమ్మతులు పనులు చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, రామారావు, జయలక్ష్మి, లక్ష్మీనర్సింహ, రమాదేవి, కిషోర్‌బాబు, రాజన్న, ఐవీ రావు, సాంబశివరావు, కవిత, నరసింహారావు పాల్గొన్నారు.

'పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి'

వైరా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలని వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్, మాజీ ఎంపీపీ బొంతు సమత పేర్కొన్నారు. శనివారం వైరా స్టడీ సర్కిల్‌లో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత 15సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా 780ఆదివారాల్లో ఈ పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమకాలీన రాజకీయ అంశాలతోపాటు ఎంపిక చేసిన పుస్తకాలు, భారత జాతీయోద్యమ చరిత్ర, భారతీయ తత్వశాస్త్రం, రామాయణం, గీతా, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, భారత రాజ్యాంగం, ప్రపంచ మహనీయుల జీవిత చరిత్రలు అనేక సాహిత్య, సాంస్కృతిక పుస్తకాల అధ్యయనం చేస్తున్నామని వివరించారు. మాజీ కన్వీనర్ బోడపట్ల రవీంద్ర, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, చంద్రశేఖర్‌బాబు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా పలువురి నియామకం



నియామక పత్రాలను అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

వైరా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన మచ్చా రామారావు టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించబడ్డారు. శనివారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఈ నియామకపత్రాన్ని రామారావుకు అందజేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు పణితి సైదులు, జాలాది రామకృష్ణ, పలువురు నాయకులు రామారావును అభినందించారు.

బోనకల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టెలికాం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మినేని కృష్ణ నియమితులయ్యారు.

చింతకాని, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శనివారం టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఉమ్మినేని కృష్ణను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మండడపు శ్రీను, కొల్లి ఉపేందర్, శంకర్ ఉన్నారు.

కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యాసా వెంకటేశ్వరరావు జిల్లా టెలికాం డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. టెలికాం డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు ఎంపిక పట్ల మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు బోర్రా రాజా తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

కారేపల్లి, జనవరి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంతో విలువైన రెవెన్యూ, ప్రభుత్వస్థలాలను కబ్జాకు గురి కాకుండా చూడాలని జిల్లా బీజేపీ నాయకుడు తురక నారాయణ కోరారు. శనివారం తహసీల్దార్ ఎస్. సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర ఆలయం సమీపంలోని విలువగల భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, మరికొన్ని ప్రాంతాలలో భూమిని కూడా కాజేసేందుకు జరుగుతున్న ప్రయత్నలను అడ్డుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈవిషయంపై తహసీల్దార్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు చుట్టు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

చింతకాని, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, గడ్డం రమణ, వత్సవాయి జానకిరాములు, నన్నక కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో హోరాహోరీగా ఖోఖో పోటీలు

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీస్టేడియం మైదానంలో శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుష, మహిళ విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపికలు జరిగాయి. 100 మంది క్రీడాకారులు పాల్గొని ఈ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. మహిళ క్రీడకారుల్లో 18, పురుషుల విభాగం నుంచి మరో 18 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 8,9,10 తేదీల్లో వరంగల్ జిల్లా గీసుకొండనందు జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పంపడం జరగుతుందని జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా క్రీడకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ వారు క్రీడాకారులకు భోజన వసతి, క్రీడా దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత శ్రీవ్యాల్ఫూర్తి ఎంఈవో నివేదిత, వ్యాయామ ఉపాధ్యాయులు బీమా, ఎస్ ప్రసాద్, నమ్మయ్య, సాంబశివరెడ్డి, రమాదేవి, శ్వేత, పద్మ పాల్గొన్నారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఎంపికైన బాలికల విభాగం ఖోఖో జట్టు

కూలీరేట్లు పెంచాలి

తల్లాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. శనివారం తల్లాడలో హమాలీ యూనియన్ బ్రాంచ్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, గార్లపాటి నాగేశ్వరావు, నల్లొండ వెంకన్న, దుగ్గిదేవర రాఘవరావు, చాపల రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ

కల్లూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో శనివారం స్ఫూర్తి ఫౌండేషన్ వారి సహకారంతో పేదలకు, వృద్ధులకు, అనాథలకు, వితంతువులకు రూ. 80 వేల విలువ గల రగ్గులను పంపిణీ చేశారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లో న్యాయవాది పప్పుల రత్నాకర్ ఆధ్వర్యంలో ఈ రగ్గుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత శ్రీవ్యాల్ఫూర్తి, రామారావు తదితరులున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధిరటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): సోషల్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు మధిర భరత్ టెక్నో స్కూల్ విద్యార్థి రాజశేఖర్ రెడ్డి ఎంపికైనట్లు భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మంలో తెలంగాణ సోషల్ ఫోరం వారు నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, డీన్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు స్రవంతి, భవాని, నాగరాజు, శశికళ అభినందించారు.

తల్లాడ....

తల్లాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర పోటీలకు తల్లాడ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం శాంతినగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తల్లాడ మండలం పినపాక ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.ఆసీఫ్, బాలభారతి విద్యాలయానికి చెందిన ఎం.లక్ష్మీశ్రీజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.



తల్లాడలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఈ విద్యార్థులను ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ అభినందించారు.

సత్తుపల్లిరూరల్....

సత్తుపల్లిరూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని రేజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన పంతంగి లక్ష్మీప్రసన్న మొదటిర్యాంక్ సాధించింది. లక్ష్మీప్రసన్నను ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం.నాగమణి, ఉపాధ్యాయురాలు కమలకుమారిలు అభినందించారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం, జనవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన పెండ్లి జావలి జిల్లాస్థాయి ఇంగ్లీష్ టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు రేమిడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈనెల 3న ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖమ్మం జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, పద్మ, పుల్లమ్మ, రాంబాబు, ఫణికుమార్, సతీష్ వజీర్ అభినందించారు.

'దివ్యాంగులకు తోడుగా నిలుద్దాం'

సత్తుపల్లిరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి దివ్యాంగులకు తోడుగా నిలుద్దామని భద్రాద్రి కొత్తగూడెం అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నల్లబోతుల రవి కోరారు. స్థానిక సిద్ధారం రోడ్‌లోని స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమాన్ని ఆయన శనివారం సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా నల్లబోతుల మంగయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5,116ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు నల్లబోతుల ప్రసాద్, అధ్యక్షుడు నర్సన్, నిర్వహకులు యూస్సీలక్ష్మి, శ్రీలత, ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్, దివ్యాంగులు పాల్గొన్నారు.

రథయాత్రను జయప్రదం చేయండి

మధిరటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న జరిగే వెయ్యి గొంతులు-లక్ష డప్పుల రథయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం మధిరలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేష్, రాజారత్నం, కిషోర్, బాబు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

వేంసూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందని ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వేంసూరు మండలశాఖ క్యాలెండర్, డైరీని శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.రామకృష్ణ, శ్రీకాంత్, ఎస్.ఫకీర్, ఉపాధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు, కార్యదర్శులు రవికుమార్, ముత్తారావు, శివ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం: సీపీఎం

వైరా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం సీపీఎం పోరాడుతుందని ఆపార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. శనివారం వైరాలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఉద్యమాలు, పోరాటాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, గుమ్మా నర్సింహారావు, మల్లెంపాటి రామారావు, కామినేని రవి, వల్లెబోయిన వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులున్నారు.

సీఎం కప్ పోటీల్లో సత్తుపల్లి విద్యార్థి ప్రతిభ



సాధించిన పతకాలతో ప్రవీణ్‌కుమార్

సత్తుపల్లిరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలలో కరాటేలో రాష్ట్రస్థాయిలో సత్తుపల్లి విద్యార్థి ద్వితీయ స్థానంలో నిలిచాడు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో హెచ్ఈపీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న నడ్డి ప్రవీణ్‌కుమార్ ఈనెల 2వ తేదీన హైదరాబాద్‌లోని కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జూనియర్ విభాగంలో ఈ ఘనత సాధించాడు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను అధ్యాపక, అధ్యాపకేతర బృందం సభ్యులు అభినందించారు.

'అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ'

ముదిగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల కోసం లిపిని సృష్టించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్ పేర్కొన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అశోక్, బ్లైండ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర ఇన్‌చార్జ్ నరేష్, జిల్లా అధ్యక్షుడు నెర్సుల వీరబాబు, కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.